


ఉష్ణోగ్రత (అంచనా)

11-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	36	27
నరసరావుపేట	33	26
బాపట్ల	36	27
రెంటచింతల	34	26
చీరాల	36	27

ఎస్జీటీల కౌన్సెలింగ్ నేటికి వాయిదా

- రాత్రి వరకు పరిష్కారం కాని సాంకేతిక సమస్యలు
- మాన్యువల్‌గా నిర్వహణకు యత్నించినా పలు సమస్యలు
- రాత్రి వరకు ఉపాధ్యాయులు పడిగాపులు
- మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయ బదిలీల కౌన్సెలింగ్ వాయిదా

గుంటూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గంద రగోళం.. ఆందోళనలు.. సాంకేతిక సమస్యలు.. వాయిదాల మధ్య సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సా..గుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌ను జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం చేపట్టేందుకు అధికారులు శతవిధాలా ప్రయత్నించారు. అయితే రాత్రి 9 గంటల వరకు కూడా సాంకేతిక సమస్యలు ఒక కొలిక్కి రాకపోవడంతో చివరకు బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహణకు మంగళవారం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒకటి నుంచి 350 వరకు సీరియల్ నెంబర్‌లోని ఎస్జీటీ తెలుగు ఉపాధ్యాయులు మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఖాళీల జాబితా సిద్ధం కాకపోవడంతో రాత్రి 9 గంటల వరకు బదిలీల ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతోపాటు అనేక సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో కౌన్సెలింగ్‌ను బుధవారానికి వాయిదా వేసినట్లు డీఈఓ రేణుక ప్రకటించారు. దీంతో రాత్రి వరకు ఉపాధ్యాయులు జడ్పీ వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరకు కౌన్సెలింగ్ వాయిదాతో ఉపాధ్యాయులు వెనుతిరిగారు. బుధవారం జరగాల్సిన కార్పొరేషన్, మున్సిపల్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌ను కూడా వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.



నేటి కౌన్సెలింగ్ వివరాలు..

మండల పరిషత్ పాఠశాలల్లోని ఎస్జీటీ(తెలుగు) ఉపాధ్యాయులకు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సీరియల్ నెంబరు 1 నుంచి 750 లోపు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ జరగనున్నది.

వ్యవసాయ శాఖలో

బదిలీల జాతర

- గుంటూరు డీఏఓ నంద్యాలకు బదిలీ
- పల్నాడు జిల్లాకు కొత్త వ్యవసాయ అధికారి
- పలువురు ఏడీఏ, ఏఓలకు స్థానచలనం
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో మారిన జాబితా ముఖ చిత్రం

6

ఇంటీరియర్ పనులు త్వరగా పూర్తిచేయాలి

- గుత్తేదారు సంస్థకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాలు

8



విఘ్నేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పెదకాపులు

ఏరువాక.. సాగారో

- కాజలో ఉత్సాహంగా రైతుల పండుగ
- రత్నగర్భ గణపతికి అన్నదాతల పూజలు

మంగళగిరి సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు జరుపుకునే అతి పెద్ద పండుగ ఏరువాక పౌర్ణమి వేడుక మంగళగిరి మండలం కాజ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జ్యేష్ట మాసం పౌర్ణమి రోజున ఏరువాక జరుపుకోవడం గ్రామంలో పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తుంది. అగస్త్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భ విఘ్నేశ్వరస్వామి విగ్రహానికి పూజలు చేసి టెంకాయలు సమర్పించారు. ఏరువాక సందర్భంగా స్వామివారిని రుద్రాక్షలతో అలంకరించారు. స్వామి వారికి నైవేద్యంగా ఉండ్రాళ్లను సమర్పించారు. ట్రాక్టర్లు, నాగళ్లు, ఎడ్ల బండ్లు, వ్యవసాయ ఉపకరణాలు, అరకలకు పసుపు, కుంకుమ రాసి ప్రదర్శనగా ఆలయం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లాంఛనంగా దుక్కి దున్ని పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, వైస్‌చైర్మన్ యర్రగుంట్ల భాగ్యారావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారథి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, కూటమి నేతలు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పల్లబోతుల శ్రీనివాసరావు, గాదె పిచ్చిరెడ్డి, దాన బోయిన రామారావు, సింహాద్రి భాస్కర్‌రెడ్డి, దొడ్డక గంగ రాజు, మాణిక్యాల రవి, గాదె సుధాకర్‌రెడ్డి, వల్లూరి శివయ్య, పల్నాటి నాగేశ్వరరావు, పెదకాపులు సింహాద్రి వెంకటరామారెడ్డి, కుక్కల కోటేశ్వరరావు, బొమ్ము పిచ్చిరెడ్డి, చెన్నం శ్రీనివాసరావు, మారెళ్ల సత్యమారెడ్డి, పిచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అరక కట్టి దున్నుతున్న మార్కెట్ చైర్మన్ కిరణ్‌చంద్, కూటమి నేతలు

'హృదయ' విదారకం..

- ఆగిన తండ్రి గుండె.. ● గంటల వ్యవధిలో కుమార్తె ఆత్మహత్య

మూడు లోకోలు ఫెయిల్యూర్

6

- గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు ● ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రయాణికులు

తాగునీరు @ 24/7

- గుంటూరు సహా నాలుగు పట్టణాల్లో
- పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు
- రానున్న ఏడాదిలో పథకం ప్రారంభానికి చర్యలు

ఇక పుష్కలంగా నీటి సరఫరా

ఈ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా..

తొలుత కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా 24/7 నీటి సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. గుంటూరులో వికాస్‌నగర్, తెనాలిలో బస్టాండ్ ఏరియా, నరసరావుపేటలో ప్రకాశ్‌నగర్, చిలకలూరిపేటలో పండరీపురం ప్రాంతాలను ఎంపిక చేశారు. ఆ ప్రాంతాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లతో పాటు డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లను నిర్మించనున్నారు. ఆయా పనులకు టెండర్లు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత 24/7 నీటి సరఫరా చేయనున్నారు.

తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియక రోజంతా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదు. ఒకవేళ ఎక్కడికైనా వెళ్తే ఆ రోజుకు తాగునీరు పట్టుకోలేమోనని ఆందోళన అవసరం లేదు. వారంలో ఏడు రోజులు.. 24 గంటలు పుష్కలంగా తాగునీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయమా.. మధ్యాహ్నమా.. సాయంత్రమా.. లేక రాత్రి అన్న తేడా లేకుండా రోజులో ఎప్పుడైనా కుళాయి తిప్పితే తాగు నీరు అందేలా సరఫరాకు చర్యలు చేపట్టింది. గుంటూరు కార్పొరేషన్‌తో పాటు తెనాలి, నరసరావు పేట, చిలకలూరిపేట పట్టణాల్లో 24 గంటల నీటి సరఫరా పథకాన్ని అమలు చేయనున్నారు. పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు. నీటి సరఫరాకు అవస రమైన పనులను గుర్తించారు. ఆయా పనులకు టెండర్ ప్రక్రియ చేపట్టారు. రానున్న ఏడాదిలో ఈ పథకం ప్రారంభించనున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎంపిక చేసిన మున్సిపల్ పట్టణాల్లో 24 గంటలు తాగునీటి సరఫరాతో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తీరిపోనున్నాయి. ఇందుకు మున్సిపాల్టీలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. 24/7 నీటి సరఫరాకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట మున్సిపల్ పట్టణాలను ఎంపిక చేశారు. ఈ పట్టణాల్లో 24/7 నీటి (మిగతా 8వ పేజీలో)





నీటి సరఫరాకు ఎంపిక చేసిన నరసరావుపేటలోని ప్రకాశ్‌నగర్



యోగాంధ్ర శిబిరంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఇతర అధికారులు

యోగాతో మానసిక ఆరోగ్యం

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి ఎకో పార్కులో సామూహిక ఆసనాలు

మంగళగిరి సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చని కలెక్టరు ఎస్.నాగలక్ష్మి తెలిపారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి ఎకో పార్కు ఆవరణలో ప్రత్యేక యోగ శిబిరం నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ ప్రసంగిస్తూ యోగాంధ్ర రాష్ట్ర ప్రజలందరి కార్యక్రమమన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ యోగా డేలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీఎఫ్‌వో (టెరిటోరియల్) హిమశైలజ, ఎంటీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, అధికారులు

పీజీఆర్ఎస్‌లో పొన్నూరు టాప్

- అట్టడుగున తాడికొండ మండలం

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో సమస్యల పరిష్కారంలో పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం ముందు వరుసలో నిలిచింది. ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు ఏ మేరకు పరిష్కరిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నది. ఫిర్యాదు సమయంలో అధికారి భాష, సంభాషణ శైలి, మర్యాదగా ప్రవర్తించారా.. లేదా, అధికారి మీ సమస్యను ఓపికగా విన్నారా.. లేదా, సమస్య పరిష్కారం మీ అంచనా, ఆశయాలకు దగ్గరగా ఉందా.. లేదా, ఫిర్యాదు పరిష్కారం అనంతరం అధికారి మీకు తగిన సమాచారం, ఎండార్స్‌మెంట్ ఇచ్చారా? మీ ఫిర్యాదు పరిష్కారం చేసిన అధికారి సామర్థ్యం ప్రవర్తనపై మీ అభిప్రాయం ఏమిటి, మొత్తం సమస్య పరిష్కారంలో సంతృప్తి చెందారా, ఈ ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ఇతరులకు సిఫారసు చేస్తారా? అని అర్జీదారులను ప్రశ్నించింది. ప్రతి తహసీల్దారుకు ఐదు మార్కులను కేటాయించగా పొన్నూరు తహసీల్దార్ జియావుల్‌హక్ 3.9 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. అర్బన్ రూరల్ పరిధిలోనూ జిల్లాలో పొన్నూరు తహసిల్దార్ ఐదు మార్కులకు 3.35 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు.

రెండో స్థానంలో చేబ్రోలు..

కాల్ సెంటర్(1100) ఫీడ్‌బ్యాక్ విశ్లేషణ ప్రకారం 3.01 స్కోర్‌తో చేబ్రోలు తహసీల్దార్ కార్యాలయానికి రెండో ర్యాంకు లభించింది. కొల్లిపర మండలం 2.59 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. తాడికొండ మండలం 0.97 స్కోరుతో అట్టడుగున నిలిచింది. మేడికొండూరు 1.35, పెదకూరపాడు 1.38 స్కోర్‌తో చివరి నుంచి మూడు, రెండు స్థానాల్లో నిలిచాయి.

దోమలు కుడుతున్నాయ్!

- బాత్రూమ్స్ సరిగా లేవు..
- నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కొమ్మినేని వ్యాఖ్యలు

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): "దోమలు కుడుతున్నాయ్. బాత్రూమ్స్ సరిగా లేవు. పడుకోవడానికి మంచం కూడా లేదు." అంటూ రాజధాని ప్రాంత మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో నిందితుడైన కొమ్మినేని శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాదులో కొమ్మినేనిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రాత్రికి గుంటూరులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అర్ధరాత్రి 12:30 వరకు విచారించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయనను లాకప్‌లో కాకుండా ఓ గదిలో ఉంచి విచారించారు. ఈ సమయంలో కొమ్మినేని పైవిధంగా వ్యాఖ్యానించారు. రాత్రి 12:30 తర్వాత ఆయన అదే గదిలో నేలపై పట్టా పరుచుకుని నిద్రపోయారు. హైదరాబాదు నుంచి వస్తుండగా మధ్యాహ్నం మార్గమధ్యంలో ఆయనకు భోజనం పెట్టించారు. ఆయన అభ్యర్థన మేరకు రాత్రికి టిఫిన్ ఇచ్చారు. ఉదయం ఐదున్నర గంటలకు నిద్రలేచి పోలీస్ స్టేషన్‌లోనే స్నానం చేసి అవే దుస్తులు తిరిగి ధరించారు.



పోలీస్‌స్టేషన్ నుంచి కొమ్మినేనిని తీసుకువెళుతున్న పోలీసులు

నేడు కస్టడీ పిటిషన్

కొమ్మినేనిని పదిరోజుల కస్టడికి ఇవ్వాలని కోరుతూ బుధవారం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. కొమ్మినేనిని కస్టడీకి తీసుకుని కుట్ర కోణం ఛేదించాల్సి ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు.. ఈ కేసులో ఏ-1గా ఉన్న కృష్ణంరాజు కోసం పోలీసు బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. ఆయన ఆచూకీ పసిగట్టిన పోలీసులు అక్కడకు చేరుకునే సరికే ఆయన అక్కడ నుంచి జారుకున్నట్టు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో కృష్ణంరాజును అదుపులోకి తీసుకుంటామని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ

8

- వసతులపై జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి ఆరా

బస్టాండ్‌లో పర్యటిస్తున్న చైర్మన్ సురేష్‌రెడ్డి పక్కన డీపీటీవో రవికాంత్

జీడీసీసీబీ భోక్తలపై

చర్యలు తీసుకోవాలి

గుంటూరు సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార(జీడీసీసీ) బ్యాంకులో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి భోక్తలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగుల సంఘ నేతలు డిమాండ్ చేశారు. సత్యమేవ జయతే పేరుతో మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల నేతలతో పాటు ఉద్యోగుల సంఘ నేతలు ప్రసంగించారు. రెవెన్యూ రికార్డు, ఆధార్, పాన్ కార్డులు సృష్టించి డీసీసీబీలో అక్రమంగా రుణాలు పొందిన వారి నుంచి సదరు మొత్తాన్ని వసూలు చేయడంతో పాటు వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సహకార శాఖ ద్వారా చేపట్టిన సెక్షన్ 51 విచారణ కొందరిని సంతృప్తి పరిచేలా, అసలైన నిందితులను కాపాడేందుకు జరిగినట్లుగా ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. అక్రమాల్లో కీలక భూమిక పోషిస్తున్న అధికారులకు కొందరు పెద్దల సహకారం ఉన్నట్లుగా భావించాల్సి వస్తుందని తెలిపారు. స్కాంతో సంబంధంలేని ఉద్యోగులపై చర్యలు నిలుపుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

సత్యమేవ జయతే అంటూ సహకార ఉద్యోగుల దీక్ష

ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డొప్పలపూడి శ్రీనివాసరావు, అఖిల భారత కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నేతలు కె.వి.ఎస్.రవికుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నారాయణరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ఎం.హనుమంతరావు, అరుణ్‌కుమార్, అంజిబాబు, జాతీయ కార్యదర్శి గని, కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు రెడ్డి, పవన్, శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్(టీడీపీ), మస్తాన్‌వలి(కాంగ్రెస్), సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొరివి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, రచయిత దేవరకొండ శ్రీనివాస్, కళాకారులు అభ్యుదయ గేయాలు ఆలపించారు.



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టిన కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులు

వ్యవసాయ శాఖలో బదిలీల జాతర

గుంటూరు సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగ ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. కూటమి ప్రభుత్వంలో మొట్టమొదటిసారి జరిగిన బదిలీ ప్రక్రియలో వ్యవసాయ శాఖలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల వ్యవసాయ అధికారులకూ స్థానచలనం తప్పలేదు. లెక్కకు మించిన సంఖ్యలో ఏడీఏలు, ఏఓలు బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో తిష్టవేసిన కింద స్థాయి అధికారులు పలువురు బదిలీ అయ్యారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేల లేఖలను సైతం పక్కన పెట్టారన్న ఆరోపణలు వచ్చాయి. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేలు చెప్పిన చోట పలువురికి పోస్టింగ్ ఇచ్చారు.

'నున్న'కు కీలక స్థానం


నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లును నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా నియమించారు. ఆయన నియామకం కోసం మంత్రులు, ఐఏఎస్‌లు సిఫార్సు చేసినట్లు తెలిసింది. కమిషనరేట్‌లో ఉన్న ఎం.జగ్గారావును పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారిగా నియమించారు. కడప జిల్లా వ్యవసాయ అధికారి ఎ. నాగేశ్వరావును గుంటూరు డీఏఓగా నియమించారు. ప్రస్తుతం గుంటూరు డీఏఓ నరసింహారావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన పదవీ విరమణ తర్వాత నాగేశ్వరావు డీఏఓగా బాధ్యతలు చేపడతారు.

మండల వ్యవసాయ అధికారులు..

బాపట్ల ఏఓ యాకోబును నరసరావుపేటకు, మంగళగిరి ఏఓ శ్రీనివాసులును గుంటూరుకు, చీరాల ఏఓ సుమతిని బాపట్లకు, కొరిశపాడు ఏఓ శ్రీనివాసరావును బల్లికురవకు, ఏఓ ఎం.సరితను వేటపాలేనికి, ఏఓ లావణ్యను మార్టూరుకు, ఏఓ కుమారిని యద్దన పూడికి, ఏఓ లక్ష్మిని మేడికొండూరుకు, ఏఓ శ్రీదేవిని పల్నాడు జిల్లా కార్యాలయానికి, ఏఓ సరితను చిలక లూరిపేటకు, ఏఓ సుభాషిణిని గుంటూరుకు, ఏఓ విజయబాబును దుగ్గిరాలకు, ఏఓ ఇల్సా సువిధను బాపట్ల జిల్లా కార్యాలయానికి, ఏఓ శ్రీరంజనిని కాకుమానుకు, ఏఓ లక్ష్మారెడ్డిని రెంటచింతలకు, ఏఓ పుల్లారెడ్డిని కొల్లూరుకు, ఏఓ బ్రహ్మారెడ్డిని భట్టిప్రో లుకు, ఏఓ శాంతిని నరసరావుపేటకు, ఏఓ సత్యవాణిని తాడేపల్లికి, ఏఓ కృష్ణ వేణిని బాపట్లకు, ఏఓ లోకేశ్వరిని బాపట్లకు, ఏఓ కల్పనను గుంటూరు కు, ఏఓ సుధారాణిని గుంటూరుకు, ఏఓ కిరణ్మయిని చీరాలకు, ఏఓ శిరీషను మంగళగిరికి, ఏఓ కృష్ణయ్య ను పెదకూరపాడుకు, ఏఓ హరిప్రసాద్‌ను యడ్లపాడుకు, ఏఓ సంధ్యారాణిని పిడుగురాళ్లకు, ఏఓ అరుణను పల్నాడుకు, ఏఓ శ్రీధర్ రెడ్డిని ముప్పాళ్లకు, ఏఓ మల్లికార్జునరావును గుంటూరుకు, ఏఓ సరళను బాపట్లకు, ఏఓ సుబ్రహ్మణ్యంను పెదనందిపాడుకు, ఏఓ హేమంత్ భరత్ కుమార్‌ను అమృతలూరుకు, ఏఓ బి. కిషోర్‌ను గుంటూరు రూరల్‌కు, ఏఓ శివ లలితను రొంపిచర్లకు, ఏఓ శోభరాణిని గుంటూరుకు, ఏఓ మోహన్‌రెడ్డిని బాపట్లకు, ఏఓ వెంకట్రావును పల్నాడు డీఏఓ కార్యాలయానికి, ఏఓ అలేఖ్య జాన్‌ను గుంటూరు కమిషనరేట్‌కు, ఏఓ సుజాతను గుంటూ రు జేడీ కార్యాలయానికి, ఏఓ ప్రియదర్శినిని చేబ్రోలు కు, ఏఓ మీరమ్మను ఇంకొల్లుకు, ఏఓ వెంకటేశ్వరా వును పొన్నూరుకు, ఏఓ బాలాజీ గంగాధర్‌ను వెల్దుర్తికి, ఏఓ రాంమోహన్ రెడ్డిని కొరిశపాడుకు, ఏఓ పద్మాంజలిని బాపట్లకు, ఏఓ రామమ్మను మాచవరానికి, ఏఓ నాగరాజును కారంచేడుకు, ఏఓ అరుణ కుమారిని బెల్లంకొండకు, ఏఓ ప్రేమ్‌సాగర్‌ను వేమూరుకు, ఏఓ శ్రీనివాసరెడ్డిని కొల్లిపరకు, ఏఓ భాస్కరరావును పర్చూరుకు, ఏఓ సునీతను వట్టిచెరుకూరుకు, ఏఓ వెంకటేష్‌ను దాచేప ల్లికి, ఏఓ నరసింహారావును కారంపూడికి, ఏఓ వెంకటరామయ్యను బాపట్లకు, ఏఓ పాపకుమారిని మాచర్లకు, ఏఓ స్రవంతిని గుంటూరుకు, ఏఓ సంధ్యారాణిని తుళ్లూరుకు, ఏఓ నరేంద్రబాబును గురజాలకు, ఏఓ శ్రీనివాస్ నాయక్‌ను తాటికొండకు, ఏఓ వరలక్ష్మిని వినుకొండకు, ఏఓ విజయరాజును నిజాంపట్నంకు, ఏఓ చంద్రశేఖర్‌ను చినగంజాంకు, ఏఓ సుధీర్ బాబును తెనాలికి, ఏఓ శారదను బాపట్లకి, ఏఓ సుగుణ బేగంను ప్రత్తిపాడుకు, ఏఓ సుధీర్‌ను బాపట్లకు, ఏఓ ఫరూక్‌ను చెరుకుపల్లికి, ఏఓ ఆంజనేయులు నాయక్‌ను నూజెండ్లకు, ఏఓ సైతాను సంతమాగులూరుకు, ఏఓ మహేష్‌బాబును రేపల్లెకు, ఏఓ ఖడ్గం రమణకుమార్ ను పెదకాకానికి, ఏఓ సుబ్బారెడ్డిని సత్తెనపల్లికి, ఏఓ కోట య్యను నరసరావుపేటకు, ఏఓ మాధవిని గుంటూ రు కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఏడీఏల బదిలీలు ఇలా..

వైసీపీ అనుకూల ఏడీఏలు గుంటూరు సమీప ప్రాంతాల్లో పాగా వేసేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. గుంటూరు ఏడీఏ పోస్టు వ్యవహారంలో తీవ్ర పోటీ ఏర్పడింది. పర్చూరులో పనిచేస్తున్న ఎన్.మోహన్‌రావును గుంటూరు ఏడీఏగా నియమించారు. బాపట్ల జిల్లా అద్దంకి ఏ డీఏ ధనరాజును బాపట్లకు, గుంటూరు ఏడీఏ అన్నపూర్ణమ్మను బాపట్ల డీఏఓ కార్యాలయానికి బదిలీ చేశారు. మంగళగిరి ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డిని బాపట్లకు, పల్నాడు జిల్లా క్రోసూరు ఏడీఏ హనుమంతురావును బాపట్లకు, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మను సత్తెనపల్లికి, సత్తెనపల్లి ఏడీఏ అమలకుమారిని పల్నాడు జిల్లా కార్యాలయానికి, వినుకొండ ఏడీఏ రవి బాబును పల్నాడు డీఏఓ కార్యాలయానికి, బాపట్ల ఏడీఏ లక్ష్మిని రేపల్లెకు, బాపట్లకు చెందిన మరో ఏడీఏ రత్నకుమారిని చీరాలకు, పల్నాడు జిల్లా కేంద్రంలో ఉన్న ఏడీఏ రవి కుమార్‌ను వినుకొండకు, ఏడీఏ శివకుమారిని గుంటూరుకు, బాపట్లలో పనిచేస్తున్న కెవీ శ్రీనివాసరావును పల్నాడు జిల్లా నరసరావుపేట ఏడీఏగా నియమించారు. గుంటూరు ఏడీఏ తోట కూర శ్రీనివాసరావు ను మంగళగిరికి బదిలీ చేశారు.

గుంటూరు డీఏఓ నంద్యాలకు బదిలీ
పల్నాడు జిల్లాకు కొత్త వ్యవసాయ అధికారి
పలువురు ఏడీఏ, ఏఓలకు స్థానచలనం
'ఆంధ్రజ్యోతి' కథనాలతో మారిన జాబితా ముఖ చిత్రం

జగన్ ప్రభుత్వంలో మీడియాపై ఆంక్షలు, దాడులు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



పొన్నూరుటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో మీడియాపై ఆంక్షలు, జర్నలిస్టులపై దాడులకు లెక్కేలేకుండా జరిగాయని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం పేర్కొన్నారు. పత్రికలు, మీడియాపై ఉక్కుపాదం మోపేందుకు నాడు వైఎస్ఆర్ జీఓ నంబరు 930 తీసుకువస్తే తండ్రి వారసత్వంగా జగన్ రెడ్డి 2430 జీవోను విడుదల చేశారని గుర్తు చేశారు. ఏబీఎన్, టీవీ 5, ఈ టీవీ లాంటి అత్యంత ప్రజాదరణ కలిగిన ఎలక్ట్రానిక్ మీడియాపై జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పదుల సంఖ్యలో అక్రమ కేసులు బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చానళ్ల ప్రసారాలను ఆపాలని కేబుల్ ఆపరేటర్‌లకు వైసీపీ పాలకులు అనధికారికంగా హుకుం జారీ చేశారని దుయ్యబట్టారు. టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్రను అర్ధరాత్రి అరెస్టు చేసి, వేధించారని గుర్తుచేశారు. సీనియర్ జర్నలిస్టు అంకబాబు, కోగంటి శ్రీనుబాబు, పరుచూరి రమ్య, దాసరి కోటి లాంటి వారిని అరెస్టు చేసి కస్టోడియల్ టార్చర్ చేశారని ఆరోపించారు. ఆంధ్రజ్యోతి విలేకరి కాటా సత్యనారాయణ హత్యకు గురైన విషయం ప్రజానీకం మరువలేదన్నారు. అమరావతిలో పోలీసులను ఫొటోలు తీశారని ముగ్గురు విలేకర్ల పై అక్రమ కేసులు బనాయించిన విషయం వైసీపీ పాలకులు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరులు ఏబీఎన్, టీవీ 5, జర్నలిస్టు ల పై దాడికి పాల్పడి కార్లు, కెమెరాలు ధ్వంసం చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీ పాసులు ఇవ్వకుండా నాటి వైసీపీ పాలకులు జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై జరిగిన దాడులు, హత్యలపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ డిమాండ్ చేశారు.

అమరావతిపై విష ప్రచారం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్

నరసరావుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సాక్షి చానల్ యాజమాన్యం ఆలోచనల మేరకు అమరావతిపై కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు కావాలని మాట్లాడారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాల పాటి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చోళులు, రెడ్డిరాజులు, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు, సిద్ధార్థుడు నడయాడిన ప్రాంతాన్ని వేశ్యల రాజధాని అని మాట్లాడం ఆడపడుచులందరిని అవమానించి నట్లేనని భావిస్తున్నామన్నారు. దీనికి కారకులైన చానల్ యాజమాన్యం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో మీనమేషాలు లెక్కపెడితే ప్రజల ఆగ్రహావేశాలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాటల్లో ఎక్కడ చూసినా రేచ్చగొట్టే ధోరణే కనపడుతుందన్నారు. సంకర జాతి అంటున్నారని, ఇది వినడానికే ఇబ్బందిగా ఉందన్నారు. రాజధానిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్ ముందుకొచ్చాయని, ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకొని ఆడపడుచులకు న్యాయం చేసి ఆత్మగౌరవం కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సాక్షి చానల్‌లో రాజధాని మహిళలనే కాదు యావత్ జాతినే కించపరిచారన్నారు. సమావేశంలో కొక్కిరాల శ్రీనినివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతనిధి గొట్టిపాటి జ నార్దన్‌బాబు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో పొగాకు కొనుగోలు చేయండి

● కంపెనీల యజమానులకు రైతు నాయకుల విజ్ఞప్తి

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహతో పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పొగాకు కొనుగోలు కంపెనీల యజమానులకు రైతు సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని ఓ హోటల్లో కంపెనీల యజమానులతో రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపారు. పొగాకు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నారని కంపెనీ యజమానుల దృష్టికి తీసుకువచ్చారు. వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, నల్లమడ రైతు సంఘం నాయకుడు కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ఈ నెల 5న జీపీఐ కంపెనీ ఎదుట జరిగిన ఆందోళనలతో కొనుగోళ్లు ముందుకు సాగాయని అన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌తో కొనుగోళ్లు ప్రారంభించిందని, ఈ సమయంలో మిగిలిన కంపెనీలు ముందుకు వస్తే సమస్య పరిష్కారమవుతుందని వివరించారు. తమ టార్గెట్‌కు మించి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తామని కంపెనీల యజమానులు ఈ మేరకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. చర్చల్లో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, ఐటీసీ జనరల్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, ఎలైన్స్ కేర్ అధినేత చేబ్రోలు రవీంద్ర, పోలిశెట్టి ఇండస్ట్రీస్ అధినేత పోలిశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.


పొగాకు కొనుగోలు కంపెనీల యజమానులుతో చర్చలు జరుపుతున్న రైతు సంఘాల నాయకులు

'హృదయ' విదారకం..

● ఆగిన తండ్రి గుండె.. ● గంటల వ్యవధిలో కుమార్తె ఆత్మహత్య


చీమకుర్తి సుబ్రహ్మణ్యం


లక్ష్మీశ్రావణి

తెనాలి, మారీసుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో 'హృదయ' విదారక ఘటన చోటు చేసుకుంది. తండ్రి గుండె ఆగిందని తెలుసుకుని కుంగిపోయిన కుమార్తె గంటల వ్యవధిలో అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఒకే రోజులో వెనువెంటనే తండ్రి, కుమార్తె మరణించడంతో.. ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోతే.. ఈ విషాదం స్థానికులను సైతం కంటతడి పెట్టించింది. తెనాలి టూటౌన్ పోలీసులు వివరాల మేరకు.. గంగానమ్మ పేటకు చెందిన పసువుల దాణా వ్యాపారి చీమకుర్తి సుబ్రహ్మణ్యం, హేమలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఏడాది క్రితం పెద్ద కుమార్తె లక్ష్మీశ్రావణికి(23) విజయవాడకు చెందిన చినరాజాతో వివాహం చేశారు. కొంత కాలానికే దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో పుట్టింట్లోనే లక్ష్మీశ్రావణి ఉంటోంది. తండ్రి సుబ్రహ్మణ్యానికి మంగళవారం ఉదయం గుండెపోటు రావడంతో స్థానికంగా ఉన్న ఓ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు పరీక్షించి అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి మృతి చెందాడన్న వార్తతో కుమార్తె లక్ష్మీ శ్రావణి ఒక్కసారిగా కుంగిపోయింది. తనను అల్లారుముద్దుగా పెంచిన తన తండ్రి విగత జీవిగా కన్పించడంతో మనోవేదనకు గురైంది. రోదిస్తూనే ఇంటికి దగ్గరలో ఉన్న అపార్ట్‌మెంటు పైనుండి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అపార్ట్‌మెంటు వాచ్‌మెన్ ఇది గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. లక్ష్మీ శ్రావణి ఓ ప్రైవేట్ వైద్యశాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతిరాలి తల్లి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

విద్యాహక్కు చట్టం ప్రవేశాల నిరాకరణపై ఆందోళన


ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

గుంటూరు (విద్య) జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక పాఠశాలలు విద్యా హక్కు చట్టం ద్వారా ఎంపికైన విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకోవడం లేదని సిటిజెన్ రైట్స్ అధ్యక్షుడు ఎస్కే జిలాని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం ద్వారా ఎంపికై.. పాఠశాలలో అడ్మిషన్ నిరాకరించిన పిల్లల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో గుంటూరు ఎంఈఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అడ్మిషన్ల కోసం పాఠశాలకు వెళ్తే యాజమాన్యాలు తల్లిదండ్రులను అవమానాలకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పిల్లల్ని ఒకటో తరగతిలో చేర్పించేందుకు విద్యా హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశామని, అయితే యాజమాన్యాలు ప్రవేశాలను నిరాకరిస్తున్నాయని చెప్పారు. ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏపీ సిటిజన్స్ రైట్స్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్‌టీఈ ప్రవేశాలను నిరాకరించే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ఆదరణ లేని కారణంగా రెండు స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. (07041) సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలుని ఈ నెల 12న, (07042) కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 13న నుంచి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే టికెట్‌లు బుక్ చేసుకొన్న వారికి పూర్తి రీఫండ్ చేస్తామన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు

● రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల

పెదకాకాని, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాల సంఖ్య, వార్షిక బడ్జెట్, విద్యార్థులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. పోటీ పరీక్షల విభాగంలోని విద్యార్థులతో చర్చించారు. మెరుగైన సేవలకు సూచనలు ఇచ్చారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ గ్రంథాలయాల అభివృద్ధికి అంకితభావంతో నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్సిటీ గ్రంథాలయ అధికారి కె.వెంకట్రావు, ఎస్వీఆర్ విద్యా సంస్థల అధిపతి వై. వెంకట్రామయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.శ్రీనివాసరావు ఉన్నారు.


వర్సిటీలోనీ లైబ్రరీలో పరిశీలన చేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చినకొండ్రుపాడు వద్ద గల పోలిశెట్టి టొబాకో కంపెనీలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ బుజ్జి హుస్సేన్ (63) స్థానిక పోలిశెట్టి టుబాకో కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం కంపెనీలో ఉన్న దేవుడి విగ్రహాలను పూజ నిమిత్తం కడిగేందుకు ప్రాంగణంలోనే ఉన్న చెరువు వద్దకు హుస్సేన్ వెళ్లాడు. బకెట్‌తో నీరు తోడుతూ.. జారి పడిపోయాడు. తోటి ఉద్యోగులు కాపాడే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. భార్య అబ్బలున్‌బీ ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

38,031 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 41,497 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,031 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,627 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	12500	334	9500	14000
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	10000	13000
4884	---	---	341	10000	14500
సూపర్ 10	---	---	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	14600
షార్క్-1	10000	12000	బ్యాడిగి	10000	13500
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

మూడు లోకోలు ఫెయిల్యూర్

● గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు ● ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రయాణికులు

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఒకే రోజున మూడు రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల లోకోమో టివ్(ఇంజిన్)లు ఫెయిల్యూర్ అయ్యాయి. (17255) నరసపూర్ - లింగంపల్లి, (12806) లింగంపల్లి - విశాఖపట్టణం, (17256) లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణం ప్రారంభించి గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోకి వచ్చాక మొరాయించాయి. గమ్యస్థానాలకు రెండు నుంచి మూడు గంటల ఆలస్యంగా చేరాయి. స్టేషన్లలో కాకుండా మధ్యలో లోకోలు ఫెయిల్ కావడంతో వాటి వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లను నిలిపేయాల్సి రావడంతో అవి కూడా ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరాయి. ఉష్ణోగ్రతలు హెచ్చుగా ఉండటంతో జనరల్, స్లీపర్ క్లాస్ బోగీల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ తిప్పర్తి రైల్వేస్టేషన్‌లో లోకో ఫెయిల్ కావడంతో రెండు గంటలకు పైగా నిలిపేశారు. ఈ రైలుకు స్టేషన్‌లో సమస్య రావడం వల్ల వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లకు ఇబ్బంది లేకపోవడంతో వాటిని పంపించేశారు. లింగంపల్లి - నరస పూర్ రైలుకు వలిగొండలో లోకో ఫెయిల్ కావడంతో గంటన్నరకు పైగా అక్కడ నిలుపుదల చేశారు. ఆ తర్వాత గుంటూరుకు వచ్చాక మరో లోకో అమర్చడానికి 30 నిమిషాలకు పైగా సమయం పట్టింది. గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఖాళీ లేకపోవడంతో రాయగ డ నుంచి గుంటూరు రావాల్సిన ఎక్స్‌ప్రెస్‌ని అవుటర్‌లో 45 నిమిషా ల వరకు నిలిపేశారు. లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్ ప్రెస్ సోమవారం ఉదయం నల్గొండ రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించే సమ యంలో లోకోలో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆ రైలు కొంతభా గం స్టేషన్‌లోని లూప్‌లైన్‌లో, మరికొంత భాగం మెయిన్‌లైన్‌లో ఉం డటంతో వెనకగా, ఎదురుగా వచ్చే రైళ్లను నిలిపేయాల్సి వచ్చింది. హౌరా నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరిన ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్‌ని నల్గొండలో 40 నిమిషాలకు పైగా నిలిపేశారు. (07421) చర్లపల్లి - శ్రీకాకుళం స్పెషల్‌ని శ్రీరాంపురంలో, తిరువనంతపురం - చర్లపల్లి శబ రి ఎక్స్‌ప్రెస్‌ని రాయనగూడలో గంటకు పైగా నిలిపేయాల్సి వచ్చింది. గంటల తరబడి రైళ్లను ఎందుకు నిలుపుదల చేశారన్న సమాచారాన్ని ప్రయాణికులకు చెప్పలేదు. దీంతో మండ టెండలో అవస్థలు పడ్డారు. మరోవైపు ఎన్‌టీఈఎస్‌లో ఫలక్‌నూమ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ ప్రకారం ప్రయాణిస్తోందని తప్పుడు సమాచారం అప్‌డేట్ చేశారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

యోగాంధ్ర కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యోగాంధ్ర - 2025 కార్యక్రమాలలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం సక్రమంగా నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ ఎస్‌కే ఖాజావలితో కలిసి యోగాంధ్ర-2025 కార్యక్రమాల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన భారీ స్థాయిలో యోగాసనాలు కార్యక్రమం నిర్వహించడానికి ముందస్తుగా జూన్ 14వ తేదీన యోగాసనాల కార్యక్రమం నిర్వహించడానికి ప్రదేశాల గుర్తింపు, మాస్టర్ ట్రైనర్స్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.

మైనింగ్ జిల్లా అధికారిగా చంద్రశేఖర్

● ప్రస్తుత డీఎంజీవో డీ శ్రీవెంకటసాయి కడపకు బదిలీ

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారిగా ఎన్ చంద్రశేఖర్ నియమితుడయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ హోదాలో ఉన్న ఆయన కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో చంద్రశేఖర్‌ని గుంటూరు డీఎంజీవోగా నియమించారు. ఇక్కడ ఉన్న ధూళిపాళ్ల శ్రీవెంకటసాయిని పరిపాలన సౌలభ్యం కోసం కడప డీఎంజీవోగా నియమిస్తూ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకుందాం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకునేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జిల్లాలోని వక్ఫ్ ఆస్తులను కాపాడుకుందాం అనే అంశంపై మంగళవారం పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గుంటూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ ఆస్తులను అభివృద్ధి పేరుతో ఏపీఐఐసీకు బదలాయించే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆవాజ్ కమిటీ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎండీ కలీం ఖాజావలి, బషీర్ అహ్మద్, కే వినయ్ కుమార్, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నసీర్

పదిహేను నిమిషాల్లో నీళ్ల ట్యాంకర్ రావాలి

● ఎమ్మెల్యే నసీర్ అల్టిమేటం

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): 'పదిహేను రోజులుగా మంచినీరు రాకపోతే ఏం చేస్తున్నారు. ఫిట్టర్ నుంచి ఏఈల వరకు విషయం తెలియదా? అన్ని తెలిసి కూడా ట్యాంకర్లు ఎందుకు పంపడం లేదు. 15 నిమిషాల్లో వాటర్ ట్యాంకర్ రావాలి. వచ్చే వరకు నేను ఇక్కడే ఉంటా' అంటూ అధికారులకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అల్టిమేటం ఇచ్చారు. అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వార్డుల పర్యటనలో భాగంగా మంగళవారం గుంటూరులోని కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. పలువురు మహిళలు తమకు మంచినీటి ట్యాంకర్ రావడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో మంచినీటి సమస్య ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. మళ్లీ ఇలాంటి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూరే శ్రీను, మల్లెంపుడి శ్రీనివాస్, పాటిబండ్ల శ్రీనివాసరావు, హరికృష్ణ, జగన్, కోట పిచ్చిరెడ్డి, వీరారెడ్డి, మస్తాన్ వలి, లక్ష్మి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జీజీహెచ్ అభివృద్ధిలో మరో ముందడుగు

గుంటూరు మెడికల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రి అభివృద్ధిలో మరో ముందడుగు పడిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. బొంగరాలబీడులోని వెల్ఫేర్ సెంటర్‌ను ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో జీజీహెచ్‌కు అనుసంధానంగా వెల్ఫేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరోగ్య కేంద్రంలో చెవి, ముక్కు, గొంతు వైద్య సేవలను కల్పిస్తున్నట్లు వివరించారు.

ఏపీ ఈ ఏపీ సెట్ లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

గుంటూరు విద్య జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ కాకినాడ ప్రకటించిన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు ఇంజనీరింగ్ అగ్రికల్చరల్ ఫార్మసీ విభాగాల్లో మెరుగైన ర్యాంకులు సాధించారని వివరించారు. విద్యార్థులు వి.రూపశ్రీ 40వ ర్యాంకు, ఎన్.రక్షిత 72వ ర్యాంకు, ఎస్.కె నిహాల్ పర్వేజ్ 74, ఓ సుష్మ 96, జి శ్రీలేఖ 110, ఎండి తబిషా హైమాన్ 298వ ర్యాంకు సాధించారని తెలిపారు ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఫార్మసీ విభాగంలో వెయ్యిలోపు 96 ర్యాంకులు, 2000 లోపు 147 ర్యాంకులు, 5000 లోపు 358 ర్యాంకులు, పదివేలలోపు 763 ర్యాంకులు విద్యార్థులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 98.9 శాతం అర్హతతో విజయం సాధించారని దుర్గాప్రసాద్ వివరించారు. విద్యార్థులను డీన్ కిషోర్, సురేష్, చంద్రశేఖర్, కృష్ణ ఏజీఎం ఎల్‌టీసీ శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తదితరులు

జీవో 36 ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లించాలి

గుంటూరు కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 జీతం చెల్లించాలని, గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసిన ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఇంజనీరింగ్ విభాగం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు కూడా వెనకాడమన్నారు. సీఐటీయూ నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కట్లగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం నాయకులు పాశం పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, రసూల్, రబ్బాని, పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నసీర్, మహిళలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మేయర్ రవీంద్ర, తెలుగు మహిళలు

మహిళల జోలికొస్తే ఖబడ్దార్!

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ హెచ్చరిక

● జగన్, సజ్జల, కృష్ణంరాజు కొమ్మినేని దిష్టిబొమ్మల దహనం

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఖబడ్దార్!, దేవతలు నడియాడిన పుణ్యభూమి అమరావతి గురించి దెయ్యాలు మాట్లాడుతుంటే సహించే ప్రసక్తిలేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ హెచ్చరించారు. అమరావతి రాజధాని మహిళలపై జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని, సాక్షి యాజమాన్యం చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హిమనీ సెంటర్లోని మహాత్ముడి విగ్రహం వద్ద జగన్, సజ్జల, కృష్ణంరాజు, కొమ్మినేని దిష్టిబొమ్మలతో పాటు సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. సాక్షి మీడియా ఛానల్‌ను మూసివేయాలని నినదించారు. అమరావతిపై అనుచిత వ్యాఖ్యల వెనుక సజ్జల స్క్రిప్ట్ ఉందని ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన గొప్ప చరిత్ర కలిగిన ప్రాంతం అమరావతి అని కొనియాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక జగన్, సజ్జల అండ్ కో చేస్తున్న కుటిలయత్నాలను చూసి అందరూ ఛీ కొడుతున్నారన్నారు. సజ్జల మాట్లాడే తీరు దారుణంగా ఉందని, ఈ విధానాల్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు.

మహిళలను దూషించిన వారిపై అంత ప్రేమ ఎందుకు?

● జగన్ నిలదీసిన తెలుగు మహిళలు

● ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపు మేరకు భారీ నిరసన

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మహిళలను దూషించిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, సజ్జల రామకృష్ణారెడ్డిపై జగన్‌రెడ్డి, భారతీలకు ఎందుకంత ప్రేమ అంటూ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి నిలదీసారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో మంగళవారం ఆమె నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఆ పిలుపునందుకున్న తెలుగు మహిళలు, కూటమి నేతలు లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం నుంచి లాడ్జి సెంటర్లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. లాడ్జి సెంటర్‌లో సాక్షి పత్రికలను దహనం చేశారు. ఈ సందర్భంగా మేయర్ కోవెలమూడి రవీంద్ర, దాసరి జ్యోతి, కనపర్తి శ్రీనివాస్ రావు తదితరులు మాట్లాడుతూ ఈ ఘటనపై జగన్, ఆయన భార్య భారతీరెడ్డి కనీసం క్షమాపణ చెప్పకపోవడం దారుణమని, అమరావతి మీద మొదటి నుంచి విషం చిమ్ముతున్న సాక్షి, ఇప్పుడూ ప్రణాళిక ప్రకారం రాజధాని మహిళలపై సభ్య సమాజం తలదించుకునేలా అనుచిత వ్యాఖ్యలు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో కసుకుర్తి హనుమంతరావు, కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, ముత్తినేని రాజేష్, శ్రీవల్లి, నేపకా పద్మ, చెంబేటి మణి కుమారి, లామ్ నవమి, శ్రీదేవి, విజయలక్ష్మి, శివలీల, బాల కోటమ్మ, గంటా మౌలిక, గుర్రం మల్లీశ్వరి, కూరాకుల శోభారాణి, శివ జ్యోతి, కరిమూన్, నాగుర్, నంది సరస్వతీ, లంకా మాధవి, తాళ్ల వెంకటేష్ యాదవ్, పోపూరి నరేంద్ర, తెలగతోటి సుధీర్, రాళ్లబండి రామరాజు, చిన్న మస్తాన్‌వలి, లామ్ వర్ధన్‌రావు, రాజీవ్ ఆనంద్, కోరంగి శ్రీను, దాసరి రమణ, దగ్గు కిరణ్, బండారు వెంకటేశ్వరరావు, సింగంశెట్టి వీరయ్య, వడ్లమూడి వెంకటేశ్వరరావు, గార్డెన్స్ శ్రీకాంత్, పఠాన్ అస్మా, చంద్రగిరి బాబు, అబ్దుల్ రహీం, యాకోబు, గంధం చలపతి, గుర్రం ప్రసాద్, మొవ్వ వేణు, దామంచర్ల శ్రీనివాస్, కన్నసాని బాజీ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా రాంబాబు



అరవపల్లి రాంబాబు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న అరవపల్లి రాంబాబును భీమవరం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా రాంబాబును బదిలీ చేస్తూ ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 530 జారీ చేసింది. రాంబాబు 36 సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో పనిచేశారు.

ఘనంగా నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

గుంటూరు(తూర్పు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు 15వ టీడీపీ డివిజన్ అధ్యక్షుడు సూరే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్ పాల్గొని కేక్ కట్ చేశారు. నసీర్ మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో బాలకృష్ణ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పుట్టగంటి వెంకటేశ్వరరావు, పాటిబండ్ల శ్రీనివాసరావు, బీరం వెంకటేశ్వర్లు, హరికృష్ణ, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురువయ్య పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నసీర్, పాల్గొన్న టీడీపీ నాయకులు



● హిందూపురం ఎమ్మెల్యే, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని బాలకృష్ణ నివాసంలో ఆయనను కలిసి మోహనకృష్ణ సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే గిరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి

● సీఎంకు, సీపీడీసీఎల్ సీఎండీ, లోకాయుక్తకు పోస్టు ద్వారా ఫిర్యాదు

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ విద్యుత్‌శాఖకు రూ.42 కోట్ల ఎగవేతపై తక్షణమే విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది షేక్ సుభాని డిమాండ్ చేశారు. ఆయన ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనాన్ని జోడిస్తూ ముఖ్యమంత్రి, సీపీడీసీఎల్ సీఎండీ, జిల్లా కలెక్టర్, లోకాయుక్తకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ పోస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సంగడిగుంటలోని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సుభాని మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తన మిల్లులకు సంబంధించి రూ.42 కోట్లు ఎగవేయటంపై ఆయన శాఖాపరమైన చర్యలతో పాటు రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దాళి గిరితో పాటు ఆయనకు సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

రవాణా శాఖలో బదిలీలు

గుంటూరు(తూర్పు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణ శాఖలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. గుంటూరులో మోటార్ వాహనం తనిఖీ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న గోపాల్ చిలకలూరిపేటకు, సంధ్య నెల్లూరుకి, అనిల్ కందుకూరుకు, బాలకృష్ణ మంగళగిరికి బదిలీ అయ్యారు. వారి స్థానంలో నరసరావుపేట, మంగళగిరిలో విధులు నిర్వహిస్తున్న శ్రావ్య, విజయసారథి గుంటూరుకు బదిలీ అయ్యారు. మంగళగిరిలో అసిస్టెంట్ మోటార్ వాహన తనిఖీ అధికారిగా పని చేస్తున్న పవన్ నరసరావుపేటకు, నెల్లూరులో విధులు నిర్వహించే సాయి ధరమ్ తెనాలికి బదిలీ అయ్యారు.

అధ్యాత్మిక ప్రవచనాలకు మారు పేరు...మల్లాది

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): రామాయణ, భారతం గురించి ప్రవచనాల ద్వారా ప్రజా బాహుళ్యానికి తెలిపిన గొప్ప వ్యక్తి మల్లాది చంద్రశేఖరశాస్త్రి అని హరికథ భాగవతార్ ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర సామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం మల్లాది చంద్రశేఖరశాస్త్రి శతజయంతి సంస్మరణ సభ జరిగింది. ఆధ్యాత్మిక ప్రవచకులు గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి, కప్పగంతు రామకృష్ణ, మల్లాది వేంకట రామనాథశర్మ, సీహెచ్ మస్తానయ్య, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ప్రముఖ సంస్కృత పండితులు డాక్టర్ దీవి నరసింహ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని చొరవతో అభివృద్ధిపథంలో గుంటూరు

గుంటూరు మెడికల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి తెలిపారు. పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం శ్రీనివాసరావుతోటలో కేక్‌కట్ చేసి, బాణాసంచా కాల్చి వేడుకలు జరిపారు. 'గోల్డెన్ ఇయర్ ఫర్ గుంటూరు పార్లమెంటు' పేరిట నిర్వహించిన ఈ వేడుకల్లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ పెమ్మసాని ప్రజల అభినందనలు అందుకుంటున్నారని హరి వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రావణ కుమారి, సరోజిని, ధరణి, మారుతీ కిషోర్, బండారు రవీంద్ర, మెహబూబ్ బాషా, నైజాం బాబు, కోలా ఆంజనేయులు, కరీం, రాధాకృష్ణ, వడ్డే సుబ్బారావు, నండూరి స్వామి, ఫణి, రమేష్, షంషేర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతితో పెట్టుకున్న వారు పతనం కాక తప్పదు

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై విషం చిమ్మిన వ్యక్తులు పతనమవుతారని, త్వరలో వైసీపీకి కూడా అదేగతి పడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ హెచ్చరించారు. రాజీవ్‌గాంధీభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టాలని చూస్తే ఇది రాతియుగం కాదని, మహిళలపై సాక్షి డిబేట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయటం హేయమని ఖండించారు. అమరావతిలో మహిళలకు వైసీపీ అధినేత జగన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ షర్మిల నాయకత్వంలో రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీయే పెద్ద దిక్కు కానుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బిళ్ళా సునీల్ తదితరులున్నారు.

జగన్ నడిపేది సిద్ధాంతం లేని పార్టీ : కంచర్ల

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): విధ్వంసాన్ని సృష్టించడం, అరాచకాన్ని ప్రోత్సహించడం సిగ్గు ఎగ్గు లేకుండా మహిళలపై అఘాయిత్యాలను చేసే వారిని పరామర్శించడం జగన్ నైజమని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరావతి మహిళలను ఘోరంగా అవమానించిన చర్చలో భాగమైన కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేస్తే, అతనిదేముందని సమర్థిస్తున్న జగన్ అసలు మనిషేనా అని ప్రజలకు అనుమానం కలుగుతోంద న్నారు.

వైసీపీని ఈసడించుకొంటున్న ప్రజలు : పాండురంగ విఠల్

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి వత్తాసుగా పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు, ఆ పార్టీ నాయకులు పిచ్చి ప్రేలాపనలకు పాల్పడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ పాండురంగ విఠల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదంతా చూస్తూ ప్రజలు రాజకీయ నాయకులంటే ఈసడించుకొనే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. రాబోయే కాలంలో ప్రజలే ఇటువంటి నాయకులను సమాజంలోకి రానివ్వకుండా తరిమి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

జీజీహెచ్‌కు రిటైర్డ్ ప్రొఫెసర్ శంకర్‌మహదేవన్

గుంటూరు మెడికల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి నాట్కో కేన్సర్ సెంటర్‌లో న్యూక్లియర్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ శంకర్ మహదేవన్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో ఆనరీ ప్రొఫెసర్‌గా నియమించేందుకు అనుమతించాలని కోరుతూ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డీఎంఈకి లేఖ రాశారు. ఇటీవల నాట్కో కేన్సర్ సెంటర్‌కు ఖరీదైన పెట్ స్కాన్ మెషిన్‌ను ప్రభుత్వం సమకూర్చింది. ఈ స్కాన్ వినియోగంలో కీలకమైన న్యూక్లియర్ మెడిసిన్ స్పెషలిస్ట్ సేవలు అవసరమని, ఇందుకోసం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ మహదేవన్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించాలని కోరుతూ సూపరింటెండెంట్, డీఎంఈకి లేఖ రాశారు.

నిర్దేశిత గడువులో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని, ప్రమాణాల మేరకు జరగని పనులకు బిల్లుల చెల్లింపు చేపట్టబోమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, కాంట్రాక్టర్ల సమస్యలు తదితర అంశాలపై మంగళవారం సంయుక్త సమావేశం జరిగింది.

మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి కాంట్రాక్టర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని, కాంట్రాక్టర్ల పట్ల పక్షపాతం లేకుండా పూర్తీ పారదర్శకంగా, నిర్దేశిత గడువు మేరకే బిల్లుల చెల్లింపు జరుగుతుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధి పోర్టల్ ద్వారేనే చెల్లింపులు, పని పూర్తైన గడువు ప్రకారం చేస్తామని తెలిపారు. తొలుత కాంట్రాక్టర్ల సంఘం నాయకుడు కొండా రమేష్ మాట్లాడుతూ గత 3, 4 ఏళ్ల కాలంలో బిల్లుల చెల్లింపులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, నూతన ప్రభుత్వంలో తక్కువ కాలంలోనే పెండింగ్ బిల్స్ చెల్లించారన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, డీఈఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు

తాగునీటి సరఫరా సమస్యలు లేకుండా చర్యలు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగు నీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) తెలిపారు. ది గుంటూరు సిటీ మునిసిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం మేయర్‌ని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి నగరంలో తాగునీటి సరఫరా మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై అర్జీ అందజేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటు న్నామని, ఎక్కడైనా పైప్‌లైన్లకు లీకులు ఏర్పడితే వెంటనే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ది గుంటూరు సిటీ మునిసిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ సభ్యులు ఓరుగంటి నారాయణరెడ్డి, వల్లూరి సదాశివరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లకు ముందే డ్రెయిన్ల నిర్మాణం చేయాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో నూతన రోడ్ల నిర్మాణానికి ముందే డ్రెయిన్ల నిర్మాణం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. కమిషనర్ మంగళవారం ఏటుకూరులోని పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్ల నిర్మాణం చేయ కుండా రోడ్లు ఏర్పాటు చేయడం వలన వర్షాలకు రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. వర్షాలకు డ్రెయిన్లలో నీరు పొంగి ప్రజలకు ఇబ్బందులు కలిగితే సంబంధిత ఏఈనే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పర్యటనలో డీఈఈ సతీష్ కుమార్, ఎస్ఎస్ రాంబాబు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

'హంస' అసోసియేషన్ ఆఫీస్ బేరర్లను పెండింగ్ లో పెట్టండి

● కలెక్టర్‌కు టీఎన్ మెడికల్ అసోసియేషన్ ఫిర్యాదు

గుంటూరు సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : హంస అసోసియేషన్ సరైన విధానం లో ఎన్నికలు నిర్వహించకుండా ఆఫీస్ బేరర్లు ఉన్నట్లు లేఖలు ఇవ్వటం చట్ట విరుద్ధం అని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు అన్నారు. అదే విషయాన్ని మంగళవారం కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి వివరించామని తెలిపారు. హంస అసోసియేషన్ బదిలీల వేల నకిలీ ఆఫీస్ బేరర్లను సృష్టించి లక్షల రూపాయలు వసూలు చేస్తున్న వ్యవహారంపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు అప్పారావు తెలిపారు. హంస అసోసియేషన్ తమకు తాలూకా యూనిట్లు ఉన్నట్లు చెప్పి ఆఫీస్ బేరర్ల పేరుతో లేఖలు ఇస్తున్నా రన్నారు. వాస్తవానికి వారి బైలా లో తాలూకాల ప్రస్తావన లేదని వివరించారు. ఒక వేల వాళ్ళు చెబుతున్నట్లుగా తాలూకాలు ఉంటే వాటికి వేరుగా ఎన్నికలు జరపాలని అన్నారు. అటువంటి వి ఏమీ లేకుండా నే నకిలీ ఆఫీస్ బేరర్ల ను సృష్టించి బదిలీల వేల సామాన్య ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికే ఈ అసోసియేషన్ పై ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేయటం జరిగిందని తెలిపారు. ఫిర్యాదు పై స్పందించిన కలెక్టర్ తాను ఈ విషయం పై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి తగిన ఆదేశాలు ఇస్తానని చెప్పినట్టు అప్పారావు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వర్కింగ్ ప్రెసిడెంట్ టీ.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మహబూబ్ సుభానీ, జాయింట్ సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు తదితరులు వున్నారు.

బలమిచ్చేలా బడి బువ్వ

● సర్కారు బడులకు చేరిన సన్న బియ్యం ● మధ్యాహ్న భోజనంలో మార్పులు

రాజుపాలెం, జూన్10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. గతేడాది అక్టోబరులో పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి అభిప్రాయాలు సేకరించింది. స్థానికంగా ఉండే అభిరుచులకు అనుగుణంగా మెనూలో మార్పులు చేసింది. తాజాగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది.

25 కేజీల సంచులు..అక్రమాలకు చెక్..

మధ్యాహ్న భోజనం కోసం ప్రత్యేకంగా 25 కేజీల సంచులు సిద్ధం చేశారు. గతంలో 50 కేజీ బస్తాలను సరఫరా చేసేవారు. అవి ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పురుగులు పట్టేవి. సగానికి తగ్గించడం వల్ల గుర్తించడం సులువుగా ఉంటుంది. అదే విధంగా ఎలాంటి అక్రమాలు జరగకుండా క్యూఆర్ కోడ్ ఉన్న ట్యాగ్ అమర్చుతున్నారు.



సిద్ధంగా ఉన్న సన్న బియ్యం సంచులు

పోషకాలు పెంపొందించేలా..

ప్రస్తుతం ప్రతి పది మందిలో ముగ్గురు చిన్నారులు విటమిన్లు, సూక్ష్మ పోషకాల లోపంతో బాధపడుతున్నారు. దీన్ని ఫోర్టిఫైడ్ ఆహారం ద్వారా సులభంగా పరిష్కరించవచ్చునని గుర్తించిన ప్రభుత్వం 25 కేజీల సంచిలో అర కేజీ ఫోర్టిఫైడ్ బియ్యం కలిపి ఇస్తుంది. ఫోర్టిఫైడ్ బియ్యం కలిపిన సన్న బియ్యం కావడంతో నీటిలో ఎంత వరకు కడగాలనే దానిపైనా వంట నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు.

450 సంచులు కేటాయింపు

రాజుపాలెం కేంద్రంగా ఉన్న పౌర సరఫరాల గోదాము నుండి రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహలకు సన్న బియ్యం సరఫరా చేశారు. రాజుపాలెం మండలానికి 268, బెల్లంకొండకు 182 సంచులు సరఫరా చేసినట్లు ఎంఈవో మల్లికార్జునశర్మ తెలిపారు.

ఇంటీరియర్ పనులు త్వరగా పూర్తిచేయాలి

● గుత్తేదారు సంస్థకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాలు


అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన భవనాల ఇంటీరీయల్ పనులను త్వరగా పూర్తిచేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అధికారులతో కలిసి అమరావతిలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు పూర్తయిన ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహాలను పరిశీలించారు. గృహాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీల బంగ్లాలు, హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులు, గుత్తేదారు సంస్థల ప్రతినిధులకు పలు ఆదేశాలు జారీ చేశారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు, ఈ6, ఈ12, ఎన్14 రహదారుల వద్ద జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కొరకు చేనేత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వసతి సముదాయాలను, కార్మికుల పిల్లలకు కల్పిస్తున్న మౌలిక వసతులను ఆయన అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సీఆర్‌డీఏ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ (ఇన్‌ఫ్రా) సీహెచ్ ధనుంజయ, చీఫ్ ఇంజనీర్ (హౌసింగ్ అండ్ బిల్డింగ్స్) ఎన్ శ్రీనివాసులు, చీఫ్ ఇంజనీర్ హౌసింగ్ అండ్ బిల్డింగ్స్ (నిర్వహణ విభాగం) డీ శ్రీరామచంద్రమూర్తి, చీఫ్ ఇంజనీర్ (కార్యాలయాలు) పీవీకే భాస్కర్, ఎస్ఈ బిట్ర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


ధర్నాకు డబ్బులు ఇచ్చి తీసుకొచ్చిన జనం


వచ్చిన జనాభాను లెక్కిస్తున్న కార్యకర్తలు

తలకింత!

వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు జనాలు రాక నానా తంటాలు పడుతున్నారు. చేసేది లేక తలకింత అంటూ లెక్క కట్టి జనాన్ని తరలించి మహా ధర్నా అంటూ తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లో మంగళవారం జరిగిన ధర్నా కూడా ఇదే తంతు. పట్టణ వైసీపీ నాయకురాలు నూరి ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డబ్బులు ఇచ్చి మహిళలను తరలించారు. ఒక్కొక్కరిని లెక్కిస్తూ ఇలా ఫొటోలకు దొరికారు.

-గుంటూరు,ఆంధ్రజ్యోతి


గుంటూరులో సాక్షి పత్రిక ప్రతులను దహనం చేస్తున్న మహిళలు


పెదకూరపాడులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు, బెలూన్లతో భారీ ర్యాలీ

మహిళల ఆగ్రహ జ్వాల

రాజధాని మహిళలపై సాక్షి న్యూస్ చానల్‌లో ప్రసారమైన అసభ్యకర వ్యాఖ్యలపై నిరసనలు కొనసాగుతున్నాయి. మహిళల ఆగ్రహ జ్వాల రగులుతూనే ఉంది. సదరు చానల్‌ను బ్యాన్ చేసి, యాజమాన్యం తక్షణమే మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు పెదకూరపాడులో మహిళలు నల్ల రిబ్బన్లు ధరించి, నల్ల బెలూన్లతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేటలోనూ ఇదే తరహాలో ప్లకార్డులతో తెలుగు మహిళలు ఆందోళన చేపట్టారు. తెనాలిలో జరిగిన మహిళల నిరసన ర్యాలీలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర పాల్గొన్నారు. గుంటూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో సదరు పత్రికా ప్రతులను మహిళలు తగలబెట్టారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయాలంటేనే భయపడే విధంగా కఠిన చట్టాలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

-ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


తెనాలిలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ శ్రేణులు


సాక్షి పత్రిక, ఛానల్‌ను మూసి వేయాలని సత్తెనపల్లిలో తెలుగు దేశం, బీజేపీ, జనసేన నిర్వహించిన ర్యాలీ


చిలకలూరిపేటలో తెలుగు మహిళల భారీ ర్యాలీ

ఆసక్తికరంగా జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు లయోలా పబ్లిక్ పాఠశాలలో జరిగిన ఏపీసీఐ ఎస్‌సీఈ పాఠశాలల జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ఆసక్తికరంగా జరిగాయి. తొలుత ప్రారంభ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంటోని, ప్రిన్సిపల్ డాక్టర్ నగయరాజ్ మార్క్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలను వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ నరేష్ ప్రారంభించారు. పోటీలలో అండర్-14 విభాగంలో లయోలా పాఠశాల- నల్లపాడు, లిటిల్ ఫ్లవర్ స్కూల్- గుంటూరు, హైదరాబాదు పబ్లిక్ స్కూల్- కడప, జట్లు పాల్గొనగా, అండర్-17


విజేతలతో పాఠశాల కరస్పాండెంట్ పోతిరెడ్డి ఆంటోని, ప్రిన్సిపాల్ నగయరాజ్

విభాగంలో లయోలా పాఠశాల- నల్లపాడు, స్టెమ్ పాఠశాల గుంటూరు జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జరిగిన పోరులో అండర్-14లో హైదరాబాదు పబ్లిక్ స్కూల్, అండర్-17 విభాగంలో లయోలా పాఠశాల జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంటోని ట్రోఫీ ప్రదానం చేశారు. పోటీలను పాఠశాల క్రీడ విభాగాధిపతి పట్టేటి బాపూజీ పర్యవేక్షించారు.

తాగునీరు @ 24/7

(5వ పేజీ తరువాయి)

సరఫరాకు అవసరమైన చర్యలను పబ్లిక్‌హెల్త్ అధికారులు చేపట్టారు. ఏడాది లోపు ఆయా పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇక ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో లక్ష జనాభా దాటిన పట్టణాల్లో అమృత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అమృత్ పథకాన్ని ప్రారంభించగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పనులను అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పనులను పట్టాలెక్కించింది. రక్షిత మంచినీటి పథకాలను విస్తరిస్తున్నారు. నరసరావుపేటలో రూ.29.42 కోట్లతో, గుంటూరులో రూ.381.12 కోట్లు, తెనాలిలో రూ.61.61 కోట్లు, చిలకలూరిపేటలో రూ.160.90 కోట్లతో అమృత్2.0 కింద పనులు చేపట్టనున్నారు.

135 లీటర్లు దాటితే పన్ను

ఒక్కొక్కరికి రోజుకు 135 లీటర్ల నీరు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇంతకు మించి నీటిని వినియోగిస్తే అదనపు నీటి పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. నీటి వినియోగాన్ని లెక్కించేందుకు మీటర్లు ఏర్పాటు చేస్తారు. నీటి పన్ను ఒక్కో పట్టణంలో ఒక్కోరకంగా ఉంది. ఉదాహరణకు నరసరావుపేటలో నెలకు ఇంటికి రూ.100 నీటి పన్ను చెల్లించాలి. ఇంట్లో ఎంతమంది ఉన్నారో గుర్తించి ఒక్కొక్కరికి 135 లీటర్ల చొప్పున వినియోగానికి నెలకు రూ.100 పన్ను చెల్లిస్తే సరిపోతోంది. ఇంతకు మించి వినియోగిస్తే అదనంగా పన్ను వసూలు చేస్తారు. నీటి వృథాను అరికట్టేందుకే ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు కొండవీడుకోటలో..

యోగాంధ్ర మహోత్సవం

● ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల హాజరు

యడ్లపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చారిత్రక కొండవీడు కోటలో బుధవారం యోగ్రాంధ్ర మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర - 2025 పేరుతో చేపట్టిన మాసోత్సవాల్లో.. రాష్ట్రంలోని 100 ప్రముఖ పర్యాటక, చారిత్రాత్మక ప్రాంతాల్లో యోగా ప్రచారాన్ని కొనసాగిస్తోంది. కొండవీడుకోట ఘాట్ మార్గం చెక్‌పోస్టు వద్ద ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు గంటన్నర పాటు యోగా ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, డ్వాక్రా సంఘాల మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.


కొండవీడుకోట ఘాట్ మార్గం


కొండవీడుకోట ఘాట్ మార్గంలో ఏర్పాటుచేసిన ప్రవేశద్వారం

ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీ

● వసతులపై జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి ఆరా

గుంటూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ ఎస్.సురేష్‌రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్‌తో కలిసి బస్టాండ్‌లోని గుంటూరు-1, 2 డిపోల్లోని గ్యారేజ్‌లతో పాటు బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తూ పరిశుభ్రత, సౌకర్యాలపై ఆరా తీశారు. డిపో గ్యారేజ్‌లలో సిబ్బందితో మాట్లాడారు. పనిముట్లతో పాటు వారికి అందుతున్న సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. బస్సులు ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచాలని సూచించారు. ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉన్న బస్సు ఎక్కిన ఛైర్మన్ ప్రయాణికులతో మాటామంతి కలిపారు. డ్రైవర్‌తో మాట్లాడి ఆక్యుపెన్సీ ఎలా ఉంది అంటూ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బస్టాండ్ లోని హోటల్స్, స్టాల్స్‌ను తనిఖీ చేసిన ఆయన ఎమ్మార్పీ మించి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి స్పష్టం చేశారు. సంస్థకు కొత్త బస్సులతో పాటు ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఛైర్మన్ సురేష్‌రెడ్డికి డీపీటీవో రవికాంత్, ఏటీఎం సత్యనారాయణ, గుంటూరు 1, 2 డిపో ఇన్‌చార్జి మేనేజర్లు , సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.


ఆర్టీసీ బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడుతున్న ఛైర్మన్ సురేష్‌రెడ్డి


ఎన్‌టీఆర్ బస్టాండ్ ఆవరణలో పర్యటిస్తున్న ఛైర్మన్ సురేష్‌రెడ్డి పక్కన డీపీటీవో రవికాంత్ తదితరులు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో 752 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,600, గరిష్టధర రూ.10,725, మోడల్ ధర రూ.10,275 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,600, గరిష్ట ధర రూ.10,735 మోడల్‌ధర రూ.10,275 పలికాయి.

రూ.8 లక్షల వ్యయంతో కర్మకాండల సత్రం

● మంత్రి లోకేశ్ సొంత నిధులతో నిర్మాణం
● సీతానగరం ఘాట్ వద్ద వేగంగా పనులు


పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న కర్మకాండల సత్రం నిర్మాణ పనులు

తాడేపల్లి టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ సొంత నిధులతో సీతానగరంలోని పుష్కరఘాట్ వద్ద కర్మకాండల సత్రం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కర్మకాండల సత్రం లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక నాయకులు మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ.8 లక్షలు వెచ్చించి కర్మకాండల సత్రం నిర్మిస్తున్నారు. సత్రం నిర్మాణం పూర్తయితే తాడేపల్లి ప్రాంత ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కృష్ణా నది వద్దకు కర్మకాండల కోసం వచ్చే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. మంగళగిరి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేశ్ గత ఆరేళ్లగా ఎంతో కృషి చేస్తున్నారు. సొంత నిధులతో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ రకాల ఉపాధి కోసం నియోజకవర్గంలో నారా లోకేశ్ అందించిన తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, కూరగాయల బండ్లు ఆయా కుటుంబాల జీవనోపాధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. నియోజకవర్గంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు జలధార వాటర్ ట్యాంకర్లు, వైద్యసేవలకు ఆరోగ్య రథాలు, ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు కుట్టు మిషన్లు, చిరువ్యాపారులకు తోపుడు బండ్లు, చేనేతలకు రాట్నాలు, స్వర్ణకారులకు పనిముట్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, పాదచారులు సేదతీరేందుకు సిమెంటు బల్లలు ఇలాంటి 27 సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేస్తూ అన్ని సామాజిక వర్గాల ప్రజలను లోకేశ్ ఆదుకుంటున్నారు.

12న అమ్మవారి ఆలయ దుకాణల నిర్వహణకు వేలం

దుగ్గిరాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని దుకాణ సముదాయాల నిర్వహణహక్కునకై వేలం నిర్వహించనున్నట్లు ఈవో కోగంటి సునీల్‌కుమార్ తెలిపారు. దేవాలయంలో భక్తులచే సమర్పించబడిన కొబ్బరిచెక్కల సేకరణ, గ్యాస్ పొయ్యిల నిర్వహణ, వాహనాల పార్కింగ్, చీరెలు, జాకెట్ ముక్కల సేకరణ, వంట సామగ్రి, టేబుల్స్, షామియానాలు అద్దెకిచ్చుట, చిన్నతీర్థం, పెద్దతీర్థం నిర్వహణ వేలం తదితర దుకాణాల నిర్వహణకై ఒక్కో దుకాణానికి రూ.50 వేలు చొప్పున దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన వచ్చునన్నారు. వేలంలో నిర్వహణ హక్కును పొందిన వారు వచ్చే జూలై 11 నుంచి 2026 జూలై 10వరకూ దుకాణాలు నిర్వహించుకోవచ్చునన్నారు.

15 నుంచి కొలుపులు

దుగ్గిరాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండూరులో కొలువైయున్న శ్రీరేణుకమ్మ దేవస్థానంలో ఈనెల 15నుంచి కొలుపులు జరుపనున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ మంగళవారం తెలిపింది. 22వ తేదీ వరకూ ఎనిమిది రోజులపాటు జరుగు ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను తిలకించాలని కోరారు.

శివాలయంలో వార్షిక కల్యాణం

కాకుమాను, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రేటూరులో ఉన్న అమరామృత లింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం కన్నుల పండువలా జరిగింది. స్వామి వారి మూలవిరాట్‌లకు పంచామృతాల అభిషేకాలను అర్చక స్వాములు నిర్వహించారు. రుద్రాభిషేకాల అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించిన అనంతరం స్వామి వారి గ్రామోత్సవం ఆలయ ధర్మకర్త గడ్డిపాటి రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

తాడేపల్లి (పెనుమాక), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి శరవేగంతో దూసుకుపోతోందని పాలకులు చెబుతున్న నేటి రోజుల్లో కూడా అక్కడక్కడ బాల్య వివాహాలు జరగడం సిగ్గుచేటని బాల్య వివాహాలను నిర్మూలించాలని ఐసీడీఎస్ మంగళగిరి ప్రాజెక్టు సూపర్‌వైజర్ పీ శిరోమణి కోరారు. పెనుమాక వందేమాతరం జడ్పీ హైస్కూల్లో కిషోర్ వికాసం పేరుతో బాలబాలికలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్టు ప్రజల దృష్టికి వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అధికారి చిన్ని కోటేశ్వరరావు, పెనుమాక మహిళా పోలీసులు అరుణిమ, కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు సరళ కుమారి, కిరణ్మయి, వెంకట్ లక్ష్మి, మేరీ జసింత, లూర్దుమేరి, అన్నామణి, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి బాలికలకు ముగిసిన శిక్షణ

మంగళగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గత నెల రెండో తేదీ నుంచి నిర్వహిస్తున్న కిశోరి బాలికల శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని బసవతారక నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ముగింపు కార్యక్రమం జరిగింది బాల్య వివాహాలు- దుష్ప్రభావాలు, బాలికా విద్య ప్రాముఖ్యం, కౌమార దశలో బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, శారీరక వ్యాయాం, యోగా తదితర అంశాలను గురించి వివరించారు. మానవహారం, సైక్లింగ్, క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, కౌమార బాలికలు, తల్లిదండ్రులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, సీడీపీవో సరితా ప్రసాద్, డీపీవో విజయ్, నీలం అంకారావు, ఐసీడీఎస్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనింగ్ జిల్లా అధికారిగా చంద్రశేఖర్

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారిగా ఎన్ చంద్రశేఖర్ నియమితుడయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ హోదాలో ఉన్న ఆయన కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో చంద్రశేఖర్‌ని గుంటూరు డీఎంజీవోగా నియమించారు. ఇక్కడ ఉన్న ధూళిపాళ్ల శ్రీవెంకటసాయిని పరిపాలన సౌలభ్యం కోసం కడప డీఎంజీవోగా నియమిస్తూ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకుందాం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జిల్లాలోని వక్ఫ్ ఆస్తులను కాపాడుకుందాం అనే అంశంపై మంగళవారం పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గుంటూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ ఆస్తులను అభివృద్ధి పేరుతో ఏపీఐఐసీకు బదలాయించే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల మెరుపుదాడులు

● 36 బృందాలుగా పలు గ్రామాల్లో తనిఖీలు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సీఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజనీర్ పీ సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 135 మంది సిబ్బంది 36 బృందాలుగా ఏర్పడి గనికపూడి, కొండేపాడు, నిమ్మగడ్డవారిపాలెం, యనమదల, మేడవారిపాలెం, తిమ్మాపురం, తుమ్మలపాలెం, గింజుపల్లివారి పాలెం, కాండజాగర్లమూడి, గ్రామాల్లో అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8 మంది, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలలో విద్యుత్ వాడుకుంటున్న ఒకరు, అదనపు లోడు వాడుకుంటున్న 82 మంది, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా వస్తున్న ఒకరిపై కేసులు నమోదు చేశామన్నారు. వీరందరి నుంచి రూ.7.07 లక్షల అపరాధ రుసుం విధించామని సీఆర్‌డీఏ పర్యవేక్షక ఇంజనీర్ పీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ వై ఏడుకొండలు, మల్లికార్జునరావు, గురునాధరావు, కోటేశ్వరరావు, సతీష్ కుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి పెదరత్తయ్య దంపతులు

పెదనందిపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థాన 9వ వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వల్లూరు గిరిధరశర్మ స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు నాదెండ్ల రామేశ్వర గురుకుల్ దివ్యచండీ హోమం, శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ పూజల్లో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

నేడు కౌలు రైతు సమస్యలపై ధర్నాను జయప్రదం చేయండి

● ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు తదితరులు

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం మంగళగిరిలో జరుగు ధర్నాను జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఉన్న కేబీ భవన్‌లో మంగళవారం కౌలు, రైతుసంఘాల నాయకులు, విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాగంటి హరిబాబు మాట్లాడుతూ నూటికి 70 శాతంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కౌలు రైతులు వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒక వైపు పండించిన పంటలకు గిట్టుబాటు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద 20వేలు ప్రతి రైతు ఖాతాలో వేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ మాట్లాడుతూ కృష్ణానది పరివాహక ప్రాంతంలో లంక భూములను సేద్యం చేస్తున్న రైతులకు వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై బుధవారం మంగళగిరిలోని సీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ ఇటీవల అకాల వర్షాలకు పంటలు నష్టపోయి కౌలు రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారని అన్నారు. పంట నష్టపోయిన కౌలు రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ అధికారులు నష్టపరిహారం అంచనావేసి పరిహారాన్ని కౌలు రైతుల ఖాతాలో జమ చేయాలని కష్ణ డిమాండ్ చేశారు.

వీర్లంకమ్మ కొలుపులు


వీరతాళ్లతో డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం

పెదనందిపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రజక కాలనీలో వీర్లంకమ్మ తల్లి కొలుపులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన వీరులను ప్రత్యేకంగా అలంకరించి వీర తాళ్లతో డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం చేశారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ పూర్తి


మండల విద్యావనరుల కేంద్రానికి వచ్చిన పాఠ్యపుస్తకాలతో ఎంఈవో కే లక్ష్మీనారాయణ

దుగ్గిరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3712 మందికి కావలసిన పాఠ్య, నోటు పుస్తకాల కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించినట్లు ఎంఈవో కాజ లక్ష్మీనారాయణ తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కింద మండలంలోని మొత్తం 54 పాఠశాలలకు పుస్తకాలు అందిచనున్నామన్నారు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ పాఠ్యపుస్తకాలను ఒక పుస్తకంగానూ, సైన్సు, సాంఘికశాస్త్రం, గణిత పుస్తకాలను ఒక పుస్తకంగానూ కూర్చి అందిచనున్నట్టు తెలిపారు. మండలంలోని ఎనిమిది జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే 6నుంచి 10వతరగతి విద్యార్థులకు, 44 ప్రాథమిక పాఠశాలలకు పుస్తకాలను అందించామన్నారు. మంచికలపూడిలోని ప్రాథమికోన్నత పాఠశాల, చిలువూరులోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటుగా, మండలంలోని మొత్తం 12 మోడల్‌పాఠశాలలకు అందించనున్నట్లు తెలిపారు. ఈమనిలోని మూడు, పెదపాలెం, చిలువూరు, పెదకొండూరులలో ఒక్కో పాఠశాలకు, దుగ్గిరాలలోని మూడు, రేవేంద్రపాడులోని రెండు మోడల్ పాఠశాలలకు ఇప్పటికే పంపిణీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలలు ప్రారంభించిన తొలిరోజునే విద్యార్థులందరికీ పుస్తకాల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు


ఎమ్మెస్సెస్ భవన్‌లో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌బీకే ఫ్యాన్స్ అధ్యక్షుడు బైరబోయిన శ్రీనివాస్, కార్యదర్శి మల్లెల నాగయ్య ఆధ్వర్యంలో కేకు కట్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ బాలకృష్ణ సినీ రంగంతోపాటు రాజకీయాల్లోనూ రాణించి ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. స్వర్గీయ ఎన్టీఆర్ స్థాపించిన బసవ తారకం కేన్సర్ ఆస్పత్రిని ప్రపంచ స్థాయికి బాలకృష్ణ తీసుకువెళ్లారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, టీడీపీ నేతలు మన్నెం రమేష్‌బాబు, మహమ్మద్ ఇబ్రహీం, పందేటి తిరుపతయ్య, అన్నే కుసుమ, వెలగపాటి విలియం, వాకా మాధవరావు, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, చావలి ఉల్లయ్య, గల్ఫ్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

పెదనందిపాడు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, ఐటీడీపీ నాయకులు దివ్వి నాగరాజు, ముళ్లపూడి చిన నాగేశ్వరరావు, నూతి శ్రీనివాసరావు, కన్నెగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరులో..

తుళ్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం టీడీపీ కార్యకర్తలు, బాలయ్య బాబు యువసేన, అభిమానులు ఘనంగా నిర్వహించారు. తుళ్లూరులో తొలుత బాలయ్య బాబు అభిమాన సంఘంసభ్యులు తాడికొండ టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్, తుళ్లూరు మండల బాలయ్య యువసేన అధ్యక్షుడు నెలకుదిటి చందు ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, లైబ్రరీ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, టీడీపీ నాయకులు బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యోగాంధ్ర - 2025 కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం సక్రమంగా నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ జేసీ ఏ భార్గవ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్‌కే ఖాజావలితో కలిసి యోగాంధ్ర-2025 కార్యక్రమాల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన యోగాసనాలు కార్యక్రమం నిర్వహించడానికి ముందస్తుగా 14వ తేదీన యోగాసనాలు నిర్వహించడానికి ప్రదేశాల గుర్తింపు, మాస్టర్ ట్రైనర్స్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.

దుగ్గిరాల వ్యవసాయమార్కెట్ యార్డు కార్యదర్శిగా జేవీ సుబ్బారావు


జేవీ సుబ్బారావు

దుగ్గిరాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా జొన్నలగడ్డ వెంకట సుబ్బారావు నియమితులయ్యారు. దుగ్గిరాల యార్డు కార్యదర్శిగా ఉన్న ఎన్ శ్రీనివాసరావు బదిలీపై తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీపై వెళ్లారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా ఉన్న సుబ్బారావు స్థానంలో నూతన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. కాగా దుగ్గిరాల యార్డుకు బదిలీయైన సుబ్బారావు బుధవారం లేదా గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

రాజధాని రైతులకు 31 ప్లాట్ల కేటాయింపు


రాజధాని అమరావతిలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు చేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

తుళ్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయ అభివృద్ధికి, అమరావతిలోని సీడ్ యాక్సిస్ రహదారి నిర్మాణానికి భూమిలిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 31 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. వీటిలో 23 నివాస ప్లాట్లు కాగా 8 వాణిజ్య పాట్లు. ఈ లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ చేపట్టారు. ప్లాట్లు పొందిన రైతులకు గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) బాలసుబ్రహ్మణ్యంతో కలిసి సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందచేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజేషన్), ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా తమ ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుం వసూలు చేయబడదన్నారు. సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ బి.సురేష్ కుమార్, సీనియర్ ప్లానర్ ఆర్‌నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నికృష్ణ, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగించుకోవాలి

● విద్యుత్‌శాఖ ఏఈ నాగమల్లేశ్వరరావు

తాడికొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం సబ్సిడీపై అందించే పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగించుకోవాలని తాడికొండ విద్యుత్‌శాఖ ఏఈ నాగమల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవటానికి సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసు కొని ప్రభుత్వానికి, వినియోగదారులకు ఖర్చులు తగ్గించాలనే పీఎం సూర్యఘర్ ముఫ్తీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన కింద ప్రభుత్వం ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌కు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడి ఇస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీతో పాటుగా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగాను, బీసీలకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ లభిస్తుం దన్నారు. ఎస్సీ, ఎస్టీ ఇళ్లపై సౌరఫలకాలు బిగించినందుకు చదరపు అడుగుకు నెలకు ఒక రూపాయి చొప్పన 200 చదరపు అడుగులకు రూ.200లు అద్దె చెల్లిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకాన్ని వినియోగించుకోవటానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పరిసరాల శుభ్రతతోనే మలేరియా నివారణ


పెదపరిమిలో మలేరియా నివారణ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది విద్యార్థులు

తుళ్లూరు, (పెదపరిమి) జూన్ 10(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే మలేరియా నివారణ జరుగుతుందని వైద్యాధికారులు అన్నారు. మంగళవారం మండలపరిధిలోని పెదపరిమిలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతంతోనే సాధ్యమని ర్యాలీలో పేర్కొన్నారు. ఇళ్ల చుట్టూ మురుగునీరు లేకుండా చూసుకోవాలని వైద్యాధికారులు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవన్నారు. రాత్రి పూట దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ జయదేవ్‌కు బంగారు పతకం


డాక్టర్ జయదేవ్‌కు బంగారు పతకాన్ని అందజేసిన ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రసాద్ తదితరులు

తెనాలి, మారీసుపేట, 10 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ వైద్యసేవలకు గాను విజయవాడ పట్టణానికి చెందిన ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ జయదేవ్ ఎస్కే బంగారు పతకాన్ని ఐఎంఏ సభ్యులు మంగళవారం అందజేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలోని ఐఎంఏ హాల్‌లో డాక్టర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఎండోమెంటు గోల్డు మెడల్‌ను విజయవాడ పట్టణానికి చెందిన ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ జయదేవ్ సుదగానికి తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి.మధు ప్రభాకర్‌బాబులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయదేవ్ మాట్లాడుతూ డాక్టర్ ప్రసాద్ అందిస్తున్న గోల్డ్ మెడల్‌ను అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. థైరాయిట్ ఓవర్ వ్యూ ఫిజీషియన్ ప్రాస్పెక్టివ్ అనే అంశంపై గోల్డ్ మెడల్ ఎండోమెంట్ లెక్చర్ ఇచ్చారు. ముఖ్యంగా థైరాయిడ్ ఓవర్ వ్యూలో వచ్చిన నూతన విధానాలు, చికిత్సల గురించి వైద్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం లో డాక్టర్లు శ్యామ్‌ప్రసాద్, చందు ఉదయ్‌భాస్కర్, పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, శేషగిరిరావు ఘంటా నరసింహారావు, ఆర్కే ప్రసాద్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా ఓబులేసు

తెనాలి, మారీసుపేట,జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణ పురపాలక సంఘ కమిషనర్‌గా చల్లా ఓబులేసు నియమితులయ్యారు. సాధారణ బదలీలలో భాగంగా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న చల్లా ఓబులేసును తెనాలి మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్న బండి శేషన్నను నంద్యాల పట్టణ పురపాలక సంఘానికి కమిషనర్‌గా వెళ్లనున్నారు.


నూతన కమిషనర్ ఓబులేసు

ఎడాపెడా విద్యుత్ కోతలు

● అల్లాడిపోతున్న గ్రామీణ ప్రజలు


కొల్లిపర సబ్‌స్టేషన్

కొల్లిపర, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు భానుడి ప్రతాపంతో మండుతున్న ఎండలు, ఉక్కపోత మరోవైపు అప్రటిత విద్యుత్ కోతలతో గ్రామీణ ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలో మున్నంగి, కొల్లిపర, చక్రాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి సమయాల్లో మూడు, నాలుగుసార్లు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడంతో గ్రామీణ ప్రజలు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి లేకుండా ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు విద్యుత్ ఇస్తారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. వారం రోజుల నుంచి విద్యుత్ కోతలు మరింత ఎక్కువగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజంతా కష్టపడి ఇంటికి చేరుకున్న కూలీలు రాత్రి సమయంలో కరెంటు పోవడంతో ఉక్కపోత, దోమల కారణంగా నిద్రలేక మళ్లీ ఉదయం తమ పనులకు వెళ్లలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు కోతలు లేవంటూనే అనధికారిక విద్యుత్ కోతలు విధిస్తుండంతో ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రాత్రి సమయాల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

అధికలోడు కారణంగానే అంతరాయం

ఇదిలా ఉంటే విద్యుత్ అధికారులు మాత్రం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ కోతలు లేవని చెబుతున్నారు. వారం రోజుల నుంచి ఎండ తీవ్రత కారణంగా వినియోగదారులు విద్యుత్‌ను ఎక్కువగా వాడటంతో అధిక లోడు కారణంగా సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీజులు పోతున్నాయని దీంతో విద్యుత్ అంతరాయం కలగటం వాస్తవమేనని చెబుతున్నారు. సబ్‌స్టేషన్లలో మరలా ఫీజులు వేయాలంటే గంటలు తరబడి పడుతుందని విద్యుత్ అధికారులు తెలియజేస్తున్నారు.

టీడీపీ లీగల్ సెల్ కమిటీ ఖరారు

తెనాలి అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ లీగల్‌సెల్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పార్టీ నాయకులు తాడిబోయిన శ్రీనివాసరావు, కాకుమాను కనకరాం బాబు, అనిత పర్యవేక్షించారు. కమిటీ అధ్యక్షుడిగా మద్ది మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడిగా నన్నపనేని మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా ఇందుపల్లి రాజారామ్, ఆర్గనైజర్ కార్యదర్శులుగా జగదీశ్వరాంబ, హరిప్రసాద్, ఉమామహేశ్వరరావు, కార్యదర్శులుగా శ్రీనాథ్, కిషోర్, ప్రదీప్‌కుమార్, కోశాధికారిగా డి.లక్ష్మి ఎన్నికయ్యారు.

రేపు వెలగా వెంకటప్పయ్య విగ్రహావిష్కరణ

తెనాలి అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమ నాయకుడు వెలగా వెంకటప్పయ్య విగ్రహంను గురువారం తెనాలి బండ్‌పై ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం తెనాలిలో కరపత్రంను విగ్రహ కమిటీ సభ్యులు వెలగా సర్వోత్తమరావు, వెలగా నాగార్జున, వెలగా వెంకట్రావు, వెలగా మానవేంద్ర, పావులూరి శ్రీనివాసరావు, అయినాల మల్లేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ, వెలగా సుధాకర్ ఈదర పూర్ణచంద్ తదితరులు ఆవిష్కరించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

వైసీపీ విష సంస్కృతికి నిదర్శనం

ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానికోసం భూములు త్యాగంచేసిన మహిళలను సాక్షి చానల్‌లో నీచంగా మాట్లాడిన జగన్ బ్యాచ్.. మరోసారి తమ విష సంస్కృతిని చాటారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తెనాలిలోని టీడీపీ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులతో కలిసి.. అమరావతి రాజధాని ప్రాంత మహిళలను కించపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ మహిళలను కించపరిచేలా సొంత చానల్‌లోనే వ్యాఖ్యలు చేయించడం చూస్తుంటే.. జగన్ ప్రాంతాల మధ్య విద్వేషాలు రాజేసి, రాష్ట్రంలో అశాంతి వాతావరణం నెలకొల్పాలని చూస్తున్నట్లుందని ఆరోపించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతిని రాజధానిగా తొలగించాలని అనేక విధాలుగా ప్రయత్నించారని.. భూములిచ్చిన రైతులను, వారి కుటుంబ సభ్యులను కూడా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాజధాని అమరావతిని శరవేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తుండటంతో కొత్త కొత్త కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. టీడీపీ కార్యకర్త జగన్ భార్య భారతిని దూషిస్తూ వీడియో సోషల్ మీడియాలో పోస్టుచేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు దానిని ఖండించారని, దూషణలకు పాల్పడిన సొంత కార్యకర్తను సైతం జైలుకు పంపించారని గుర్తుచేశారు. మహిళలకు తగిన గౌరవం ఇచ్చే సంస్కారం ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడన్నారు. కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజు వ్యాఖ్యాలను సమర్థిస్తున్న అంబటి రాంబాబు, సజ్జల వంటివారిపై హోంశాఖ మంత్రి కఠినచర్యలు తీసుకోవాలని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు.


వన్‌టౌన్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ శ్రేణులు


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్సు

ప్రమాదకరంగా విద్యుత్ ఫ్యూజు బాక్సు

పొన్నూరు టౌన్, (చేబ్రోలు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శలపాడులో విద్యుత్ ఫ్యూజు బాక్సు ప్రమాదకరంగా మారింది. గ్రామంలో కొత్తపాలెం సెంటర్ వద్ద విద్యుత్ స్తంభానికి అమర్చిన ఫ్యూజు బాక్సు కేవలం అడుగు ఎత్తులో ఏర్పాటు చేశారు. ఫ్యూజు బాక్సు మూత లేకపోవడంతో విద్యుత్ ఫ్యూజులు, వైర్లు, బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్నారులు, మూగజీవాలు ఆ ప్రాంతానికి వెళితే ప్రాణ నష్టం జరిగే అవకాశముంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఫీజు బాక్సులకు మూత ఏర్పాటు చేయడంతో పాటు బాక్సును ఎత్తుకు మార్చాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

జన సైనికుల కుటుంబాలకు అండగా ఉంటాం

● రోడ్డు ప్రమాదంలో కార్యకర్తల మృతి బాధాకరం

● బీమా చెక్కులు అందజేసిన మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలు మృతి చెందటం బాధాకరమని ఆయా కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని కొలకలూరు, ఖాజీపేట గ్రామాల్లో మంగళవారం మంత్రి మనోహర్ పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసైనికులు గమిడి ఏడుకొండలు, వెలివల మహేష్‌బాబుల కుటుంబసభ్యులను పరామర్శించి రూ. 5లక్షల చొప్పున కుటుంబసభ్యులకు చెక్కులు అందించారు. ఆయా కుటుంబాలను ఓదార్చి నిలుస్తామని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల గుంతలమయంగా మారినా కనీసం వాటి మరమ్మతులు కూడా చేపట్టలేదన్నారు. ఆయా రోడ్లపై వాహనాలతో వెళ్లే వారు ప్రమాదాల బారిన పడి మృతిచెంది పలు కుటుంబాల్లో శోకాన్ని మిగిల్చారన్నారు. తెనాలి ప్రాంతంలో జీవనోపాధికని పనులకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డుప్రమాదంలో జనసైనికులు గమిడి ఏడుకొండలు, వెలివల మహేష్‌బాబులు మృతి చెందారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రహదారులన్నింటిని బాగుచేయించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని త్వరలో నాలుగులైన్ల రహదారి నిర్మాణానికి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. తొలుత మృతులు గమిడి ఏడుకొండలు, వెలివల మహేష్‌బాబుల చిత్రపటాలకు మంత్రి మనోహర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.


మృతుడు మహేష్‌బాబు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి మనోహర్

మైనింగ్ జిల్లా అధికారిగా చంద్రశేఖర్

● కడపకు ప్రస్తుత డీఎంజీవోడీ బదిలీ

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారిగా ఎన్ చంద్రశేఖర్ నియమితుడయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ హోదాలో ఉన్న ఆయన కొన్ని నెలల నుంచి పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో చంద్రశేఖర్‌ని గుంటూరు డీఎంజీవోగా నియమించారు. ఇక్కడ ఉన్న ధూళిపాళ్ల శ్రీవెంకటసాయిని పరిపాలన సౌలభ్యం కోసం కడప డీఎంజీవోగా నియమిస్తూ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.


ధర్నాలో పాల్గొన్న కార్మికులు

పని గంటలు పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించాలి

● సీపీఎం కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలి అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం పని గంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం కార్యదర్శి బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని లేబర్ కమిషన్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శాస్త్రీయంగా ఆలోచించి ఎనిమిది గంటల పని దినాన్ని ప్రవేశపెడితే మార్చాలనే నిర్ణయం సరికాదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ విధానమే అమలులో ఉందని, మార్చాలనుకునే నిర్ణయాన్ని సమీక్షించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. షేక్ హుస్సేన్‌వలి, పద్మ, దుర్గాప్రసాద్, రమణ, బాపమ్మ, కోటేశ్వరి, మీనాక్షి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకుందాం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు (తూర్పు), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. జిల్లాలోని వక్ఫ్ ఆస్తులను కాపాడుకుందాం అనే అంశంపై మంగళవారం పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గుంటూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ ఆస్తులను అభివృద్ధి పేరుతో ఏపీఐఐసీకు బదలాయించే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్టీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆవాజ్ కమిటీ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎండీ కలీం ఖాజావలి, బషీర్ అహ్మద్, కే వినయ్‌కుమార్, లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొల్లిముంతకు ఘన నివాళి



బొల్లిముంత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యులు

తెనాలి అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం కళారంగాన్ని వినియోగించిన అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ అని సర్పంచ్ బండికళ్ల ప్రసాద్ చెప్పారు. రూరల్ మండలం కఠెవరంలో అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండికళ్ల మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అభ్యుదయ రచయితగా తీసిన సినిమాలు సమాజాన్ని చైతన్యవంతం చేశాయన్నారు. కార్యక్రమంలో మాణిక్యాలరావు, నీలాంబరం, బొల్లిముంత కృష్ణ, బాబురావు, పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యోగాంధ్ర - 2025 కార్యక్రమాలలో అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం సక్రమంగా నిర్వహించేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలితో కలిసి యోగాంధ్ర-2025 కార్యక్రమాల నిర్వహణపై కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. జూన్ 21వ తేదీన యోగాసనాలు నిర్వహించడానికి ముందస్తుగా జూన్ 14వ తేదీన యోగాసనాల కార్యక్రమం నిర్వహించడానికి ప్రదేశాల గుర్తింపు, మాస్టర్ ట్రైనర్స్ మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.

మున్సిపల్ కార్మికులకు రూ.21వేల వేతనం అమలు చేయాలి

● సీఐటీయూ గౌరవాధ్యక్షుడు రమేష్‌బాబు


నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పొన్నూరు టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21వేల జీతం, అమలు చేయాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు నిమ్మకూరి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. కార్మికులకు జీవో నెం.36 ప్రకారం రూ.21వేల వేతనాలు అందించాలని షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు, ఎక్స్‌గ్రేషియా అమలుచేయడంతో పాటు మృతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు చట్టపరమైన సెలవుల మంజూరు, కిట్‌లను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, ఉమాశంకర్, ఇంజినీరింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జయదేవ్‌కు బంగారు పతకం

తెనాలి, మారీసుపేట, 10 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ వైద్యసేవలకు గాను విజయవాడ పట్టణానికి చెందిన ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ జయదేవ్ ఎస్కే బంగారు పతకాన్ని ఐఎంఏ సభ్యులు మంగళవారం అందజేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలోని ఐఎంఏ హాల్‌లో డాక్టర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఎండోమెంటు గోల్డు మెడల్‌ను విజయవాడ పట్టణానికి చెందిన ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ జయదేవ్ సుదగానికి తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి.మధు ప్రభాకర్‌బాబులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయదేవ్ మాట్లాడుతూ డాక్టర్ ప్రసాద్ అందిస్తున్న గోల్డ్ మెడల్‌ను అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. థైరాయిట్ ఓవర్ వ్యూ ఫిజీషియన్ ప్రాస్పెక్టివ్ అనే అంశంపై గోల్డ్ మెడల్ ఎండోమెంట్ లెక్చర్ ఇచ్చారు. ముఖ్యంగా థైరాయిడ్ ఓవర్ వ్యూలో వచ్చిన నూతన విధానాలు, చికిత్సల గురించి వైద్యులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో డాక్టర్‌లు శ్యామ్‌ప్రసాద్, చందు ఉదయ్‌భాస్కర్, పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, శేషగిరిరావు ఘంటా నరసింహారావు, డాక్టర్ సీఎస్ఆర్కే ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


డాక్టర్ జయదేవ్‌కు బంగారు పతకాన్ని అందజేసిన ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ ప్రసాద్ తదితరులు


మహిళామండలి భవనం

నేడు మహిళా సాధికారత భవనం ప్రారంభం

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నేడు మహిళ సాధికారత భవనంను, మొదటి అంతస్తును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కొత్తపేటలోని రూ.5కోట్ల విలువగల స్థలం, కార్యాలయంను (మహిళ మండలి భవనం) ఇటీవల మున్సిపాలిటీకి మహిళ మండలి సభ్యులు విరాళంగా అందజేశారు. గతంలో ఈ భవనంలో మహిళ మండలి భవనం నడిచేది. ప్రస్తుతం ఈ భవనాన్ని మహిళ సాధికార భవనంగా మార్చి ఆధునికీకరించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప అధికారి డాక్టర్ అన్నపూర్ణ


డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి, మారీసుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ అన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాలలో గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్షలపై డాక్టర్ అన్నపూర్ణ సబ్ డిస్ట్రిక్ లెవల్ సలహా సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు స్కానింగ్ సెంటర్లలో నిర్వహించారాదన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే సెంటర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ సభ్యులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ చట్టం గురించి అవగాహన కల్పించే బోర్డులను ప్రధాన కూడళ్లు అయిన బస్టాండ్, రైల్వే స్టేషన్, పార్కుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ సురేష్, రెడ్‌క్రాస్ సొసైటీ ట్రెజరర్ నాళం శ్రీమన్నారాయణ, పెనుగొండ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు

అక్రమ అడ్మిషన్లు అడ్డుకుంటాం

●ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్

తెనాలి అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూళ్లలో అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వెంకటేష్ చెప్పారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థల కార్యాలయాలను సందర్శించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు, దుస్తుల పేరిట సామాన్యులను అడ్డంగా దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజులను వసూలు చేయాలని, అడ్మిషన్ల పేరుతో ఇళ్లకు వెళ్లి బలవంతంగా సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పేద విద్యార్థులకు విద్యాహక్కు చట్ట ప్రకారం 25శాతం సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. హాస్టల్స్‌లో వసతులు మెరుగుపరచాలని, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కిరణ్‌బాబు, తేజ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.